
సాక్షి ఒడిశా
మంగళవారం । 14 । ఫిబ్రవరి । 2023



శ్రీమందిరం ఆదాయం లెక్కింపు

భువనేశ్వర్: పూరీ జగన్నాథాలయంలో భక్తులు కానుకల రూపంలో సమర్పించిన హుండీ ఆదాయాన్ని ఆలయ పాలకవర్గం సోమవారం లెక్కించారు. ఇందులో నగదు రూ.5,99,812లు, బంగారం 100మిల్లీగ్రాములు, వెండి 10 గ్రాములు ఉన్నాయని అధికారులు వెల్లడించారు.



పాత పద్ధతికి స్వస్తి పలకండి

- 8లో



ధరల రెక్కలకు కళ్లెం వేయాలి

- 8లో

న్యూస్‌రీల్

ఉత్సవాల్లో ఆకట్టుకున్న నృత్యాలు



ఉత్సవాల్లో ఆకట్టుకున్న శ్రావణి నృత్య ప్రదర్శన

బరంపురం: నగరంలోని డైమండ్ ట్యాంక్ రోడ్డు ప్రాంగణంలో గత 4 రోజులుగా జరుగుతున్న పోతులూరు వీరబ్రహ్మేంద్ర స్వామి ఆలయ 53వ వార్షిక నవరాత్రి ఉత్సవాలు వైభవంగా జరుగుతున్నాయి. సోమవారం జరిగిన కార్యక్రమాల్లో భక్తులు హాజరై, స్వామివారికి ప్రత్యేక పూజలు చేసి, దర్శించుకున్నారు. అలాగే ఆంధ్రప్రదేశ్ లోని శ్రీకాకుళానికి చెందిన చిత్రాడ సాయిబాబ బృందం సాయిశివ నృత్య కళానికేతన్ నృత్యకారులు శ్రావణి, వాగ్దేవి, హర్ష శర్మ ప్రదర్శించిన కూచిపూడి, భరతనాట్యం నృత్యాలు ఆకట్టుకుంటున్నాయి.

కారు బోల్తా.. వ్యక్తికి గాయాలు



లోయలో పడి ఉన్న కారు

రాయగడ: జిల్లాలోని కల్యాణ సింగుపూర్ సమితి మజ్జిగుడ గ్రామ సమీపంలో ఆదివారం రాత్రి జరిగిన రోడ్డు ప్రమాదంలో అదే గ్రామానికి చెందిన ప్రశాంత్ ప్రస్కా(22) తీవ్ర గాయాల పాలయ్యాడు. విశాఖపట్నం నుంచి తన ఇంటికి కారులో వస్తుండగా వాహనం అదుపుతప్పి లోయలో పడిపోయింది. ఆదివారం ఉదయం అటుగా వెళ్తున్న కొందరు లోయలో పడి ఉన్న కారును గమనించారు. పోలీసులకు సమాచారం అందించగా, ఐఐసీ ముకుందదేవ్ నాయక్ ఘటనా స్థలానికి చేరుకుని, క్షతగాత్రుడుని సమీపంలోని ఆస్పత్రికి తరలించారు.

మోదీజీ.. సహకరించండి



పార్లమెంట్‌లో కొరాపుట్ ఎంపీ సప్తగిరి ఉల్క

కొరాపుట్: దేశ ప్రధానమంత్రి సహకరిస్తేనే తన నియోజకవర్గంలోని ఓ గ్రామ ప్రజల సమస్య తీరుంతుందని కొరాపుట్ ఎంపీ సప్తగిరి ఉల్క కోరారు. పార్లమెంట్ ఆయన సోమవారం జీరో అవర్ సమయంలో మాట్లాడారు. తన పార్లమెంటరీ పరిధిలోని గంబారిపుట్ గ్రామ ప్రజలు భౌగోళికంగా ఇబ్బందులు పడుతున్నారని తెలిపారు. ఈ గ్రామానికి 3కిలోమీటర్ల దూరంలో కొరాపుట్ జిల్లా దశమంత్‌పూర్ సమితి కేంద్రం ఉందన్నారు. అయితే గ్రామ పంచాయతీ కేంద్రం 40కిలోమీటర్ల దూరంలోని రాయగడ జిల్లా కాశీపూర్ సమితి కుచెయి పొదర్‌లో ఉందని పేర్కొన్నారు. నిత్యం రేషన్ సరుకులు, ఇతర ప్రభుత్వ పథకాలు కోసం లబ్ధిదారులు అంత దూరం ప్రయాణించాల్సి వస్తుందని ఆవేదన వ్యక్తంచేశారు. ఈ గ్రామాన్ని జయపురం మహారాజు కాశీపూర్ రాజుకి విరాళంగా ఇచ్చారన్నారు. ఇటీవల ఆ మార్గంలో ప్రయాణిస్తున్న సమయంలో గ్రామస్తులు తమ సమస్యను తెలియజేశారన్నారు. దీనిపై కేంద్రప్రభుత్వం, ప్రధానమంత్రి నరేంద్రమోదీ దృష్టి సారించి, గంబారిపుట్ వాసుల ఇబ్బందులకు పరిష్కారం చూపాలని కోరారు.

మాజీమంత్రి రబి నందోకు అస్వస్థత



రబినారాయణ నందో

జయపురం: మాజీ మంత్రి, బీజేడీ సీనియర్ నాయకులు రబి నారాయణ నందో సోమవారం అస్వస్థతకు గురయ్యారు. ఈ మేరకు ఆయన జయపురం జిల్లా కేంద్ర ఆస్పత్రిలో చేరారు. పరీక్షించిన వైద్యులు మెరుగైన వైద్యం నిమిత్తం విశాఖపట్నంకు తీసుకు వెళ్లాలని సూచించారు. వెంటనే అతని కుటుంబ సభ్యులు, స్నేహితులు విశాఖలోని ప్రైవేట్ ఆస్పత్రికి తరలించారు. ప్రస్తుతం ఆయన ఆరోగ్యం కుదుటపడిందని, త్వరలోనే క్షేమంగా తిరిగి వస్తారని సన్నిహితులు తెలిపారు.

లక్ష్మీపూర్‌లో .. అమానుషం

- భార్య, కుమార్తెను చంపి తానూ ఆత్మహత్య చేసుకున్న భర్త
- ముగ్గురిది హత్య చేశారని ఆరోపిస్తున్న కుటుంబ సభ్యులు



లింగరాజ్, జ్యోత్స్న దంపతులతో కుమార్తె ఈశా (ఫైల్ ఫొటో)



సోఫాలో విగతజీవిగా పడి ఉన్న జ్యోత్స్న



ఉరి వేసుకున్న లింగరాజ్ బిసోయి

కొరాపుట్: భార్య, కుమార్తె లను హతమార్చి, ఆపై భర్త కూడా ఆత్మహత్య చేసుకున్న విషాద ఘటన జిల్లాలో ఆదివారం రాత్రి చోటు చేసుకుంది. దీనిపై పోలీసులు, స్థానికులు తెలిపిన వివరాలు ఇలా ఉన్నాయి. కొరాపుట్ జిల్లా లక్ష్మీపూర్ సమితి జాతీయ రహదారి–326 లోని తోయాపుట్ గ్రామానికి చెందిన లింగరాజ్ బిసోయి అసియాస్ రాజు(34) మొబైల్ దుకాణం నిర్వహిస్తున్నాడు. ఆదివారం రాత్రి తన భార్య జ్యోత్స్న(25)తో పెద్దగా వాగ్వాదానికి దిగడాన్ని ఇరుగు–పొరుగు వారు గమనించారు. కొంత సమయం తర్వాత నిశ్శబ్దంగా మారడంతో అనుమానం వచ్చిన స్థానికులు.. వారి బంధువులకు సమాచారం ఇచ్చారు. వారంతా వచ్చి తలుపు తట్టినా తెరువకపోవడంతో పోలీసులకు తెలియజేశారు. పోలీసు సిబ్బంది అక్కడికి చేరుకొని, గ్యాస్ కట్టర్లతో తలుపులను విరగ్గొట్టి లోపలికి ప్రవేశించారు. అప్పటికే జ్యోత్స్న సోఫాపై విగజీవిగా పడి ఉంది. ఆమె మెడకు తాడుతో బిగించిన ఆనవాళ్లు కనిపించాయి. పక్కనే మృతిచెంది ఉన్న రెండేళ్ల చిన్నారి ఈశా బిసోయి మెడకు కూడా తాడు బిగించి ఉంది. మరో గదిలో లింగరాజ్ బిసోయి ఉరి వేసుకుని ఉన్నాడు.

అప్పుల కారణంగానే..

ఘటనలో భార్యభర్తలు, కుమార్తె మృతదేహాలను చూసిన గ్రామస్తులు ఒక్కసారిగా హాహాకారాలు చేశారు. పోలీసులు మృతదేహాలను కొరాపుట్ జిల్లా కేంద్రంలోని సాహిద్ లక్ష్మణ్ నాయక్ ప్రభుత్వ వైద్యశాల ఆస్పత్రికి తరలించి, పోస్టుమార్టం నిర్వహించారు. సోమవారం జిల్లా కేంద్రం నుంచి సైంటిఫిక్ బృందాలు ఘటన స్థలానికి చేరుకొని, ఆధారాలు సేకరించాయి. మరోవైపు జ్యోత్స్న కుటుంబీకులు మీడియాతో మాట్లాడుతూ ముగ్గురి మరణాలు హత్యలుగా ఆరోపించారు. మృతుడు లింగరాజ్ తన సెల్‌ఫోన్ దుకాణం నిర్వహన విషయంలో అప్పులు పాలైనట్లు చెబుతున్నారు. దీనిపై కేసు నమోదు చేసిన పోలీసులు దుకాణంలోని హార్డ్ డిస్క్, సెల్‌ఫోన్లు స్వాధీనం చేసుకున్నారు. అప్పులు బాధలు పడలేకే కుమార్తెతో సహా లింగరాజ్ దంపతులు ఆత్మహత్యకు పాల్పడినట్లు భావిస్తున్నారు.

కాళ్ల పారాణి ఆరకముందే..



ఘటనకు కారణమైన ట్రాక్టర్



నవ దంపతులు వేణు, సుభద్ర(ఫైల్)

- రోడ్డు ప్రమాదంలో నవ దంపతులు మృతి
- ఒడిశాలోని బలేగడా–గొళంత్రా వద్ద ఘటన
- వరుడి స్వస్థలం ఇచ్ఛాపురం, వధువుది బరంపురం

బరంపురం/ఇచ్ఛాపురం: కాళ్ల పారాణి ఆరక ముందే నవ దంపతులను మృత్యువు కాటేసింది. ఆంధ్ర–ఒడిశా సరిహద్దు జాతీయ రహదారి–16లో జరిగిన ఈ ఘటనలో బరంపురానికి చెందిన వధువు, ఇచ్ఛాపురానికి చెందిన వరుడు మృతిచెందారు. దీనిపై గొళంతరా ఐఐసీ వివేకానంద మహంతి తెలిపిన వివరాలు ఇలా ఉన్నాయి. ఒడిశాలోని గంజాం జిల్లా బరంపురం నగరానికి చెందిన చట్టి ప్రతిమ(22)తో ఇచ్ఛాపురం మున్సిపాలిటీ పరిధి 23వ వార్డు బెల్లుపడ కాలనీకి చెందిన గవళాపు వేణు(26)తో ఈనెల 10న సింహాచలంలో వివాహం జరిగింది. ఆదివారం రాత్రి వరుడి ఇంటి వద్ద విందు ఏర్పాటు చేశారు. సోమవారం ఉదయం దంపతులిద్దరూ బైక్‌పై అత్తవారింటికి బరంపురం వెళ్లారు. అక్కడి నుంచి రాత్రి సమయంలో ఇంటికి తిరిగి వస్తుండగా ఒడిశాలోని బలేగడా–గొళంతరా పెట్రోల్ బంక్ సమీపంలో ట్రాక్టర్‌ను వెనుక నుంచి బలంగా ఢీకొనడంతో ఈ ఘటన చోటు చేసుకుంది. దీంతో ఇద్దరూ చెల్లాచెదురుగా పడిపోగా, వధువు అక్కడికక్కడే మృతిచెందింది. తీవ్రంగా గాయపడిన వరుడిని బరంపురం ఎంకేసీజీ మెడికల్ కళాశాల ఆస్పత్రికి తరలించారు. అక్కడ చికిత్స పొందుతూ మృతిచెందినట్లు కుటుంబ సభ్యులు తెలిపారు. వేణు ఇచ్ఛాపురంలోని బట్టల దుకాణంలో పనిచేస్తుండగా, తల్లి నాగరత్నం, అన్నయ్య వెంకటేష్‌తో కలిసి ఉంటున్నాడు. నవ దంపతులు మృతి చెందడంతో బెల్లుపడ కాలనీ, బరంపురంలో విషాదఛాయలు అలమున్నాయి. దీనిపై కేసు నమోదు చేసి, దర్యాప్తు చేస్తున్నామని ఐఐసీ వివరించారు. ఘటనపై వార్డు కౌన్సిలర్ ప్రదీప్, బెల్లుపడ కాలనీపెద్దలు సంతాపం వ్యక్తం చేశారు.

కారును ఢీకొన్న బస్సు

- నలుగురికి గాయాలు



ఘటనా స్థలంలో నుజ్జునుజ్జయిన వాహనాలు

మల్కన్‌గిరి: జిల్లాలోని చిత్రకొండ సమితి ఘాటీలో ఎదురుగా వస్తున్న ప్రైవేట్ బస్సు–ఇన్నోవా బలంగా ఢీకొన్నాయి. అయితే కారులో ఉన్న వారంతా సీట్‌బెల్ట్ పెట్టుకోవడంతో పెను ప్రమాదం తప్పింది. దీనిపై పోలీసులు తెలిపిన వివరాలు ఇలా ఉన్నాయి. మల్కన్‌గిరికి చెందిన వ్యాపారి నీలకంఠరావు తన స్టోన్ క్రషర్ వద్ద పూజలు నిర్వహించి, కుటుంబ సభ్యులతో సహా ఇన్నోవాలో ఇంటికి బయలుదేరారు. ఎదురుగా వస్తున్న బస్సు డ్రైవర్ ఫుల్‌గా మద్యం సేవించి, కారును బలంగా ఢీకొన్నాడు. దీంతో రెండు వాహనాలు నుజ్జునుజ్జయ్యాయి. ఘటనలో కారులో ఉన్న నలుగురు గాయపడగా, మల్కన్‌గిరి ప్రభుత్వం ఆస్పత్రికి తరలించారు. ఘటనపై పోలీసులు కేసు నమోదు చేసి, డ్రైవర్‌ను అదుపులోకి తీసుకున్నారు.

మహిళలకు చీరలు పంపిణీ



చీరలు పంపిణీ చేస్తున్న రమాదేవి

రాయగడ: భారత కవికోకిల సరోజినీనాయుడు జయంతి సందర్భంగా పట్టణంలోని సాయిప్రియ మహిళా వాకర్స్ క్లబ్ ఆధ్వర్యంలో కొత్తపేట సమీపంలోని మట్టికోన గ్రామంలో మహిళలకు చీరలు, నిత్యావసర వస్తువులను సోమవారం పంపిణీ చేశారు. క్లబ్ అధ్యక్షురాలు రమాదేవి నేతృత్వంలో సభ్యులంతా గ్రామానికి చేరుకుని, అక్కడి వారితో కొద్దిసేపు మాట్లాడారు. అనంతరం సమస్యలను అడిగి తెలుసుకున్నారు.

ఎస్‌డీసీ కౌన్సిల్‌కు దిశా నిర్దేశం



ప్రదీప్ మాఝిని సన్మానిస్తున్న కలెక్టర్ మిశ్రా, ఎమ్మెల్యేలు

కొరాపుట్: ఆదివాసీ స్పెషల్ డెవలప్‌మెంట్ కౌన్సిల్ సభ్యులకు దిశా నిర్దేశం చేశారు. ఈ మేరకు నవరంగ్‌పూర్ జిల్లా మిషన్‌శక్తి సమావేశ మందిరంలో రాష్ట్ర ఎస్‌డీసీ సలహాదారుడు ప్రదీప్ మాఝి అధ్యక్షతన సోమవారం సమావేశం జరిగింది. జిల్లాలోని 13 ఆదివాసీ తెగల ప్రతినిధులతో చర్చలు జరిపారు. వారి సమస్యల పరిష్కారానికి చర్యలు తీసుకోవాలని ప్రదీప్ ఆదేశించారు. ఇందులో భాగంగా 17మంది సభ్యులు, జిల్లా అధ్యక్షుడు ఉపేంద్ర గొండోను సన్మానించారు. సమావేశంలో జిల్లా కలెక్టర్ డాక్టర్ కమలోచన్ మిశ్రా, డాబుగాం ఎమ్మెల్యే మనోహర్ రంధారి, నవరంగ్‌పూర్ ఎమ్మెల్యే సదాశివ ప్రధాన్, జిల్లా పరిషత్ అధ్యక్షుడు మోతిరాం నాయక్, అధికారులు పాల్గొన్నారు.

ఉగాది ఉత్సవాలపై గందరగోళం



నెక్కంటి నివాసంలో జరిగిన సమావేశానికి హాజరైన పట్టణ ప్రముఖులు

- రాయగడలో 2 వేదికలపై నిర్వహించే అవకాశం
- పోటాపోటీగా ఏర్పాట్లు చేస్తున్న నెక్కంటి, కొండాబాబు వర్గాలు



మాట్లాడుతున్న మాజీ ఎంపీ నెక్కంటి భాస్కరరావు



మాట్లాడుతున్న వెంకటేశ్వరరావు

రాయగడ: ఈ ఏడాది ఉగాది ఉత్సవాలు పట్టణంలో 2ప్రాంతాల్లో జరిగే అవకాశాలు కనిపిస్తున్నాయి. గత ఆరేళ్లుగా రాజ్యసభ మాజీ ఎంపీ నెక్కంటి భాస్కరరావు ఆధ్వర్యంలో తెలుగు సంఘాలన్నీ సమైఖ్యతతో ఉత్సవాలు నిర్వహిస్తుండేవి. అయితే కొందరు వేరుకుంపటి పెట్టడంతో పాటు ఉగాది ఉత్సవాలు నిర్వహించేందుకు ఇప్పటికే సన్నాహాలు, సమావేశాలు నిర్వహిస్తున్న నేపథ్యంలో తెలుగు సంఘాలు ఎవరికి మద్దతివ్వాల్లో.. ఎవరితో కలిసి ఉత్సవాలు నిర్వహించేందుకు సహకరించాలో అని గందరగోళంలో ఉన్నారు. ఈ తరుణంలో ఆదివారం సాయంత్రం రాయగడ పోటాపోటీగా సన్నాహక సమావేశాలు జరిగాయి. రాణిగుడ ఫారంలోని నెక్కంటి నివాసంలో తెలుగు సంఘాలకు చెందిన ప్రతినిధులు, ప్రముఖులు ఉత్సవాలను నిర్వహించేందుకు సమావేశమయ్యారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గత ఆరేళ్లుగా తెలుగు వారి సమైఖ్యతకు అద్దంపట్టే విధంగా ఉమ్మడి ఉత్సవాలను ఘనంగా నిర్వహించామని గుర్తుచేశారు. అయితే ఈ ఏడాది కొంతమంది స్వార్థం కారణంగా తెలుగు వారి ఐక్యతకు దెబ్బకొట్టే విధంగా వ్యవహరించడం విచారకరమన్నారు. కొద్దిరోజుల క్రితం అంతా కలిసి ఒకే వేదికపై ఉగాది ఉత్సవాలు నిర్వహించేందుకు పట్టణ ప్రముఖులతో కలిసి శాంతి కమిటీ ఏర్పాటు చేశామని తెలిపారు. అనంతరం ఆయా కమిటీ ప్రతినిధులు సంప్రదింపులు చేసినప్పటికీ ఫలితం శూన్యమని పేర్కొన్నారు. దీంతో తెలుగు సంఘాల ప్రతినిధులతో సుదీర్ఘంగా చర్చించి, తదుపరి నిర్ణయం తీసుకునేందుకు సమావేశాన్ని ఏర్పాటు చేశామని వివరించారు.

అందరి సహకారంతో..

తెలుగు సంఘాల ప్రతినిధులంతా సహకరిస్తే ఈ ఏడాది ఉగాది ఉత్సవాలను అత్యంత ఘనంగా నిర్వహించేందుకు నడుం బిగిస్తానని మాజీ ఎంపీ నెక్కంటి ప్రకటించారు. ఇందులో ఎటువంటి ఒడిదుడుకులైనా ఎదుర్కొంటానని సభాముఖంగా తెలియజేశారు. ఉత్సవాలు ఘనంగా నిర్వహించేందుకు అన్ని వర్గాలతో సమాలోచన చేసి, కమిటీని ఏర్పాటు చేస్తామన్నారు. తెలుగ భాషా, సంస్కృతి, తెలుగు వారి స్వాభిమానం పరిరక్షించేడమే కర్తవ్యమని పేర్కొన్నారు. సమావేశంలో పాల్గొన్న రాయగడ మున్సిపాలిటీ చైర్మన్ మహేష్ పట్నాయక్, రాఘవ కుముంధాన్, చంద్రమౌళి కుముంధాన్, శిల్లా జగన్నాథరావు, కాంట్రాక్టర్ శ్రీనివాస్‌రావు తదితర ప్రముఖులు తమ సంఘీభావాన్ని వ్యక్తపరిచారు.

కొండబాబు ఆధ్వర్యంలో..

ఇదిలా ఉండగా ఉగాది ఉత్సవాలను అంతా కలిసి నిర్వహించేందుకు గత కొద్ది నెలలుగా విస్తృతంగా సమావేశాలు నిర్వహిస్తున్న బీజేడీ సీనియర్ నాయకుడు వై.వెంకటేశ్వరరావు(కొండబాబు), కాసినాయుడు, పి.గౌరీశంకరరావు, కింతలి రాజు తదితరులు పట్టణానికి సమీపంలోని జేకేపూర్ వేంకటేశ్వర ఆలయంలో ఆదివారం సాయంత్రం సమావేశం నిర్వహించారు. పరిసర ప్రాంతాలకు చెందిన తెలుగు ప్రజలు పెద్ద సంఖ్యలో హాజరయ్యారు. తెలుగు వారి సమస్యలను పరిష్కరించేందుకు తాను ఎల్లప్పుడూ కృషి చేస్తానని ఈ సందర్భంగా తెలిపారు. ఉగాది ఉత్సవాలను జిల్లాస్థాయిలో ఘనంగా నిర్వహించే విధంగా అంతా కలిసి నడవాలని కోరారు. దీనికి ప్రతి తెలుగు వ్యక్తి సహాయ, సహకారాలు ఎంతో అవసరమని పేర్కొన్నారు.

ఆపద్బాంధవులు



రక్తదానం చేస్తున్న పద్మినీ పాత్రో



రక్తదానం చేస్తున్న కాళీచరణ్

జయపురం: అత్యవసర సమయంలో రక్తదానం చేసిన ఇద్దరు సామాజిక కార్యకర్తలు ఆపద్బాంధవులుగా నిలిచారు. పట్టణానికి చెందిన కాళీచరణ దేవశర్మ, పద్మినీ కృతిబాస్ పాత్రో అత్యవసర పరిస్థితుల్లో ఉన్న రోగులకు రక్తదానం చేసి మానవత్వాన్ని చాటుకున్నారు. జయపురం పట్టణానికి సమీపంలో జరిగిన రోడ్డు ప్రమాదంలో ఇద్దరు వ్యక్తుల తీవ్రంగా గాయపడ్డారు. చికిత్స నిర్వహించిన వైద్యులు అత్యవసరంగా ఓ పాజిటివ్ రక్తం అవసరమని తెలిపారు. విషయం తెలుసుకున్న కాళీచరణ్ వెంటనే ఆస్పత్రికి చేరుకొని, రక్తదానం చేశాడు. అలాగే తన జన్మదినం సందర్భంగా పద్మినీ పాత్రో సకాలంలో రక్తం అందించి, ప్రాణాలు కాపాడారు. ఆమె ఇప్పటి వరకు 31సార్లు రక్తదానం చేశారు. ఈ నేపథ్యంలో ఇరువురికీ కృతజ్ఞతలు తెలిపిన బాధిత కుటుంబ సభ్యులు, అభినందించి ప్రోత్సహించారు.

ఆస్పత్రిలో మానసిక దివ్యాంగుడి హల్‌చల్



ఆస్పత్రి పై అంతస్తులో దివ్యాంగుడు శ్యాం హరిజన్



అగ్నిమాపక సిబ్బంది అదుపులో బాధితుడు

కొరాపుట్:

నవరంగ్‌పూర్ జిల్లా కేంద్ర ఆస్పత్రి వద్ద మానసిక దివ్యాంగుడు హల్‌చల్ చేశాడు. సోమవారం ఉదయం ఆస్పత్రి పై భాగానికి చేరుకొని, అక్కడి నుంచ కిందకు దూకే ప్రయత్నం చేస్తుండగా సిబ్బంది గుర్తించారు. కిందకు దిగాలని కేకలు వేయగా.. ఎవరైనా దగ్గరకు వస్తే దూకి ఆత్మహత్య చేసుకుంటానని సమాధానం ఇచ్చాడు. దీంతో ఆస్పత్రి వర్గాలు అగ్నిమాపక సిబ్బందికి సమాచారం ఇచ్చారు. వారు నేర్పుగా పైకి చేరుకొని, అతనిని అదుపులోకి తీసుకున్నారు. అయితే అప్పటికే అతను పదునైన ఇనుప రాడ్డుతో మెడపై గాయం చేసుకున్నాడు. వెంటనే ఆస్పత్రిలో చేర్పించి, చికిత్స అందించారు. తన పేరు శ్యాం హరిజన్‌గా తెలిపిన బాధితుడు.. ఊరు గుర్తుకు రావడం లేదని బదులిచ్చాడు. మానసిక రోగంతో బాధ పడుతున్నట్లు వైద్యులు ప్రకటించారు.

క్లుప్తంగా

వైభవంగా కోటదుర్గమ్మ ఆలయ వార్షికోత్సవ పూజలు

పార్వతీపురం: మండలంలోని సంగంవలసలో శ్రీ కోటదుర్గమ్మ ఆలయ వార్షికోత్సవ పూజలను సోమవారం అత్యంత వైభవంగా నిర్వహించారు. వార్షికోత్సవం సందర్భంగా మహిళలతో కుంకుమపూజలను ఆలయ అర్చకుడు మహేష్ ఆధ్వర్యంలో అత్యంత భక్తి శ్రద్ధలతో నిర్వహించారు. అనంతరం ఆలయ ప్రాంగణంలో అన్నదానం ఘనంగా నిర్వహించారు. కార్యక్రమంలో స్థానికులు స్వచ్ఛందంగా పాల్గొని సేవలు అందించారు.

రూ.9 వేల పింఛన్ అందించాలి



సమావేశంలో ప్రసంగిస్తున్న ప్రదీప్ మహంతి

జయపురం: దేశంలో విశ్రాంత కార్మికుల పట్ల కేంద్రప్రభుత్వం ఉదాసీనత వహిస్తోందని కొరాపుట్ జిల్లా ఈపీఎఫ్ పెన్షన్‌దారుల అసోసియేషన్ కార్యదర్శి ప్రదీప్ మహంతి ధ్వజమెత్తారు. పట్టణంలోని కార్మిక భవనంలో పింఛన్‌దారుల అసోసియేషన్ సాధారణ సమావేశం సోమవారం నిర్వహించారు. అసోసియేషన్ అధ్యక్షుడు నళినీ రథ్ అధ్యక్షతన జరిగిన సమావేశంలో ప్రదీప్ మాట్లాడారు. 2014కి ముందు ఉద్యోగ విరమణ చేసిన కార్మికులకు కేవలం రూ.వెయ్యి మాత్రమే పెన్షన్ ఇస్తున్నారని, దీనిని రూ.9 వేలకు పెంచాలని డిమాండ్ చేశారు. సంఘం నాయకులు కిశోర్ పండా, నరహరి చలాన్, శివ పట్నాయక్, జగబంధు హంతాల్, మన్మథ రథో, పితబాస్ మిశ్రా తదితరులు పాల్గొన్నారు.

నలుగురు మహిళలకు తీవ్ర గాయాలు

భోగాపురం: భోగాపురం జాతీయ రహదారిపై టాటా ఏస్ వాహనం అదుపుతప్పి డివైడర్‌ను ఢీకొనడంతో నలుగురు మహిళలు తీవ్ర గాయాలపాలయ్యారు. సోమవారం ఉదయం జరిగిన ఈ ప్రమాదం వివరాలిలా ఉన్నాయి. విశాఖపట్నానికి చెందిన కోట్ల రేవతి కనకమహలక్ష్మి, సంగం కరుణ, గుడివాడ కనకమహలక్ష్మి, అనుపూజ నీలిమలు శ్రీకాకుళం జిల్లా రణస్థలం మండలం పాతర్లపల్లి పీహెచ్‌సీలో ఎన్ఎంఆర్‌లుగా విధులు నిర్వహిస్తున్నారు. ప్రతిరోజూ ఈ నలుగురు మహిళలు విధులకు ఆటోలో వెళ్లి వస్తుంటారు. ఈ క్రమంలో సోమవారం ఉదయం విశాఖపట్నం నుంచి టాటా ఏస్ వాహనంలో విధులకు బయలుదేరారు. భోగాపురం చేరుకునేసరికి వాహనం అదుపుతప్పి వైడర్ ఢీకొట్టడంతో తీవ్ర గాయాలపాలయ్యారు. విషయం తెలుసుకున్న ఎస్సై కృష్ణమూర్తి సిబ్బందితో కలిసి సంఘటన స్థలానికి చేరుకుని క్షతగాత్రులను సుందరపేట సీహెచ్‌సీకి తరలించారు. క్షతగాత్రుల ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేశామని ఎస్సై తెలిపారు.

అగ్నిప్రమాదంలో గాయాలు

పార్వతీపురం/బలిజిపేట: బలిజిపేట మండలం వెంగాపురం గ్రామానికి చెందిన యామల రాణి సోమవారం ఉదయం ఇంటి వద్ద చలిమంట కాగుతున్న సమయంలో మంటలు అంటుకోవడంతో శరీరమంతా కాలిపోయింది. ఈ మేరకు చికిత్స కోసం పార్వతీపురం జిల్లా ఆస్పత్రికి తరలించగా వైద్యులు చికిత్స అందిస్తున్నారు.

గడ్డివాములకు నిప్పు



సంఘటనా స్థలంలో మంటలు అదుపు చేస్తున్న దృశ్యం

వంగర: మండల పరిధి కొప్పరవలస గ్రామ సమీపంలో ఉన్న పంట పొలాల్లో సోమవారం అగ్నిప్రమాదం సంభవించింది. వరిపంట నూర్పిడి అనంతరం 25 ఎకరాల విస్తీర్ణంలో ఉన్న గడ్డివాములకు గుర్తుతెలియని వ్యక్తులు నిప్పు పెట్టారు. సమీపంలో ఉన్న నీలగిరి తోట పాక్షికంగా దెబ్బతింది. జొన్న పంటకు నిప్పంటుకుంటుందేమోనని స్థానిక రైతులు రాజాం అగ్నిమాపక శకటానికి సమాచారం అందించారు. హుటాహుటిన సంఘటనా స్థలానికి చేరుకున్న ఫైర్ ఇంజిన్ మంటలను అదుపు చేయడంతో ఎటువంటి ఆస్తినష్టం సంభవించలేదు.

ఉరి వేసుకుని యువకుడి ఆత్మహత్య

పాచిపెంట: మండలంలోని పాంచాలి గ్రామానికి చెందిన గన్ను సోమశేఖర్(28) మనస్తాపానికి గురై ఆత్మహత్యకు పాల్పడ్డాడు. వివరాలిలా ఉన్నాయి. సోమశేఖర్‌కు ఇటీవల పెళ్లి కుదిరింది. తనకు ఆ వివాహం ఇష్టంలేదనే విషయం ఇంటివద్ద చెప్పలేక మనస్తాపానికి గురై ఈనెల 10వతేదీన ఇంటి నుంచి బయటకు వెళ్లిపోయాడు, విషయం తెలుసుకున్న కుటుంబసభ్యులు సోమశేఖర్ కోసం చాలాచోట్ల వెతికారు. అయితే గ్రామ శివారులో ఉన్న ఎయిర్‌టెల్ టవర్ కేబుల్ రూమ్‌లో ఉరివేసుకుని ఆత్మహత్యకు పాల్పడినట్లు సోమవారం ఆటుగా వెళ్లిన గ్రామస్తులు కొందరుచూసి కుటుంబసభ్యులకు తెలిపారు. దీంతో కుటుంబసభ్యులు అక్కడికి చేరుకుని వెంటనే పోలీసులకు సమాచారం ఇచ్చారు. పోలీసులు మృతదేహాన్ని పరిశీలించి పోస్టుమార్టం నిమిత్తం సాలూరు సీహెచ్‌సీకి తరలించారు. దీనిపై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై వెంకటరమణ తెలిపారు.

పాత పద్ధతికి స్వస్తి పలకండి

- నూతన సాగు విధానంతో అధిక దిగుబడులు
- జిల్లాస్థాయి వ్యవసాయ మేళాలో ఎంపీ చంద్రశేఖర సాహు



కళాకారులను సత్కరిస్తున్న ఎంపీ, అతిథులు



మాట్లాడుతున్న ఎంపీ చంద్రశేఖర సాహు

పర్లాకిమిడి: విత్తు నుంచి కోత వరకు పాత పద్ధతిలో వ్యవసాయం చేయడం వల్ల ఎన్నో ప్రయాసలు పడాల్సి వస్తుందని బరంపురం ఎంపీ చంద్రశేఖర్ సాహు అన్నారు. యంత్రాల ద్వారా సాగు చేయడం వల్ల దిగుబడి రెండింతలు పెరిగి, రైతులకు అదనపు ఆదాయం లభిస్తుందని అభిప్రాయం వ్యక్తంచేశారు. జిల్లా కేంద్రంలోని గజపతి స్టేడియంలో గత 3రోజులుగా జరుగుతున్న జిల్లాస్థాయి వ్యవసాయ యంత్రాల మేళా సోమవారం ముగిసింది. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ దేశంలో ఏటా 37వేల మెట్రిక్ టన్నుల సిరిధాన్యాల ఉత్పాదన జరుగుతోందని కేంద్రం ఇటీవల ప్రకటించిందన్నారు. అయితే రాష్ట్రప్రభుత్వం అన్ని జిల్లాల్లో మిల్లెట్ మిషన్ కార్యక్రమాన్ని ఎప్పుడో ప్రారంభించిందన్నారు. గజపతి జిల్లాలోని గుసాని బ్లాక్ లావణ్యగడ, చంద్రగిరి, గుమ్మా, రాయఘడ, కాశీనగర్ బ్లాక్‌లో రాగులు, చోడి తదితర సిరిధాన్యాలు పండిస్తున్నారని తెలిపారు. వీరందరి ప్రయోజనాలకు సీఎం నవీన్ సారథ్యంలోని బీజేడీ ప్రభుత్వం ప్రత్యేక చర్యలు తీసుకుంటుందన్నారు. కార్యక్రమంలో భాగంగా వివిధ సమితుల నుంచి విచ్చేసిన 13మంది రైతులకు పవర్ టిల్లర్లు, వ్యవసాయ పంపుసెట్లు, విత్తనాలు అందజేశారు.

భారీగా యంత్రాల అమ్మకాలు..

గత నాలుగు రోజులుగా జరిగిన వ్యవసాయ యంత్రాల మేళాలో జిల్లావ్యాప్తంగా 129మంది రైతులు రిజిస్ట్రేషన్ చేసుకోగా, 89మందికిపంపుసెట్లు, ట్రాక్టర్లు, పవర్ టిల్లర్లు కొనుగోలుకు ఆర్డర్లు చేశారు. వీటి విలువ రూ.1,09,70,668లుగా ఉందని అగ్రికల్చర్ అసిస్టెంట్ ఎగ్జిక్యూటివ్ ఇంజినీర్ ఆర్‌సీ సింగ్ తెలిపారు. లబ్ధిదారులకు రూ.13,62,700 లను సబ్సిడీగా అందించామన్నారు. కార్యక్రమంలో భాగంగా సాంస్కృతిక కార్యక్రమాలు నిర్వహించి విష్ణుపాఢి బృందం, గజపతి సెక్యూరిటీ సంస్థలకు జ్ఞాపికలు అందించి, సత్కరించారు. సమావేశంలో జిల్లా పరిషత్ అధ్యక్షుడు గవర తిరుపతిరావు, ఏడీఎం(రెవెన్యూ) ప్రదీప్‌కుమార్ నాయక్, జిల్లా వ్యవసాయశాఖ అధికారి కైలాష్‌చంద్ర బెహరా, గుమ్మా బ్లాక్ వ్యవసాయ విస్తరణ అధికారి నారాయణ చాంద్, గుమ్మా బ్లాక్ అధ్యక్షురాలు సునేమీ మండళ్, రాయఘడ బ్లాక్ అధ్యక్షురాలు పూర్ణబాసి నాయక్, కాశీనగర్ బ్లాక్ చైర్‌పర్సన్‌బల్ల శాయమ్మ తదితరులు పాల్గొన్నారు.

ఇంటిపన్నులో
20శాతం రాయితీ

- ఒన్‌టైమ్ సెటల్‌మెంట్‌లో చెల్లించే వారికి వర్తింపు
- ఏకగ్రీవంగా ఆమోదించిన రాయగడ మున్సిపల్ కౌన్సిల్



మాట్లాడుతున్న మున్సిపల్ చైర్మన్ మహేష్ పట్నాయక్, పక్కన ఎమ్మెల్యే ముదులి, శుభ్ర పండా

రాయగడ: ఆదాయ వనరులు సేకరించడంపై స్థానిక మున్సిపాలిటీ యంత్రాంగం దృష్టి సారించింది. మున్సిపాలిటీ పరిధిలో నివసిస్తున్న వారి నుంచి బకాయి పడి ఉన్న ఇంటిపన్ను వసూలు చేసేందుకు ప్రణాళికలు రూపొందించారు. ఈ క్రమంలో ఇంటి పన్నులు చెల్లించే వారికి సదావకాశాన్ని కల్పించారు. ఒన్‌టైమ్ సెటల్‌మెంట్(ఒటీఎస్) పథకాన్ని అమలు చేశారు. దీర్ఘకాలంగా బకాయి పడి ఉన్న పన్ను ఒకేసారి చెల్లించిన వారికి 20శాతం రాయితీ ఇచ్చేందుకు కౌన్సిల్ సమావేశంలో తీర్మానించారు. ఈ మేరకు వివరాలను మున్సిపాలిటీ చైర్మన్ మహేష్ పట్నాయక్ విలేకర్లకు తెలియజేశారు. సోమవారం జరిగిన కౌన్సిల్ సమావేశంలో.. గత కొన్నేళ్లుగా సుమారు 60శాతం మంది ఇంటి యజమానులు మున్సిపాలిటీకి ఇంటి పన్ను చెల్లించకుండా బకాయి పడినట్లు గుర్తించారు. వారి నుంచి బకాయిలు వసూలు చేసేందుకు ప్రస్తావనకు రావడంతో రాయితీ నిర్ణయానికి అంతా ఏకగ్రీవంగా ఆమోదం తెలిపారు. మున్సిపాలిటీ పరిధిలో సుమారు 20వేలకు పైగా కుటుంబాలు నివసిస్తున్నాయి.

డ్రైనేజీ వ్యవస్థ మెరుగు పరుస్తాం..

ఇదిలా ఉండగా పట్టణంలో నెలకొన్న పారిశుద్ధ్యాన్ని మెరుగుపరడంపై ప్రత్యేక శ్రద్ధ తీసుకునేందుకు చర్యలు తీసుకుంటున్నట్లు మున్సిపల్ చైర్మన్ పట్నాయక్ తెలిపారు. ప్రధానంగా కొన్ని ప్రాంతాల్లోని మురుగు కాలువల పరిస్థితి అత్యంత దయనీయంగా ఉన్నాయని అంగీకరించారు. దీంతో చిన్నపాటి వర్షం కురిసినా రోడ్లపై నీరు నిల్వ చేరి, అపరిశుభ్ర వాతావరణానికి కారణమవుతున్న నేపథ్యంలో ఆయా ప్రాంతాల్లోని మురుగు కాలువలను కొత్తగా నిర్మించేందుకు, చెత్తా చెదారాలతో పేరుకుపోయిన కాలువలను శుభ్రపరిచే పనులను త్వరలో చేపట్టనున్నట్లు పేర్కొన్నారు. కాలువల పూడిక తీసేందుకుగాను అదనంగా మరో 18మంది కార్మికులను తాత్కలికంగా మున్సిపాలిటీ నియమిస్తుందన్నారు. పట్టణాన్ని సర్వాంగ సుందరంగా తీర్చి దిద్దే విషయంలో మరిన్ని చర్యలు, కొత్త ప్రణాళికలు రూపొందిస్తున్నట్లు వివరించారు. సమావేశానికి రాయగడ ఎమ్మెల్యే మకరంద ముదులి ప్రత్యేక ఆహ్వానితులుగా హాజరయ్యారు. వైస్ చైర్‌పర్సన్ శుభ్ర పండా, మున్సిపాలిటీ కార్యనిర్వాహక అధికారి యాసీన్ బిలాల్ అహ్మద్ తదితరులు పాల్గొన్నారు.

ధరల రెక్కలకు కళ్లెం వేయాలి



మాట్లాడుతున్న సీపీఎం రాష్ట్ర ఉపాధ్యక్షుడు హోలికిశోర్ పట్నాయక్

- సీపీఎం రాష్ట్ర ఉపాధ్యక్షుడు హోలికిశోర్ పట్నాయక్

బరంపురం: దేశంలో కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల అసమర్థ పాలన, నిర్లక్ష్యం కారణంగా నిత్యావసర సరుకుల ధరలు రోజురోజుకీ పెరిగిపోతున్నాయని సీపీఎం రాష్ట్ర ఉపాధ్యక్షుడు హోలికిశోర్ పట్నాయక్ విమర్శించారు. పెరిగిన ధరలను తగ్గించేందుకు వెంటనే చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. బరంపురంలోని దక్షిణాంచల్ ఆర్‌డీసీ కార్యలయం ఎదుట సీపీఎం గంజాం జిల్లాశాఖ ఆధ్వర్యంలో 2023-24 కేంద్రం బడ్జెట్‌కు వ్యతిరేకంగా సోమవారం ఆందోళన చేపట్టారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కేంద్రంలో బీజేపీ, రాష్ట్రంలో బీజేడీ ప్రభుత్వాల హయాంలో పెరిగిన ధరల కారణంగా సాధారణ ప్రజలు ఇబ్బందులకు గురవుతున్నారని ఆవేదన వ్యక్తంచేశారు. దీనిపై ఇరు ప్రభుత్వాలు స్పందించి, దిద్దుబాటుచర్యలు చేపట్టకపోతే ఆందోళన ఉధృతం చేస్తామని హెచ్చరించారు. అనంతరం ఆర్‌డీసీ టి.అపాంగ్ ఆవోకు వినతిపత్రం అందించారు. ఆందోళనలో జిల్లా అధ్యక్షుడు రమేష్ సాహు, నాయకులు పాల్గొన్నారు.



పర్లాకిమిడి: డిప్యూటీ కలెక్టర్‌కు వినతిపత్రం అందిస్తున్న సీపీఎం జిల్లా కార్యదర్శి దండపాణి

ప్రజా వ్యతిరేక బడ్జెట్

జయపురం: కేంద్రంలోని నరేంద్రమోదీ నేతృత్వంలో ఎన్‌డీఏ ప్రభుత్వం పార్లమెంట్‌లో ప్రవేశపెట్టిన వార్షిక బడ్జెట్ రైతు, శ్రామిక, సాధారణ ప్రజల వ్యతిరేక బడ్జెట్ అని సీపీఐ కొరాపుట్ జిల్లాశాఖ ఆరోపించింది. ఈ మేరకు ఆ పార్టీ జిల్లాశాఖ కార్యదర్శి జుధిష్ఠర రౌళో నేతృత్వంలో జయపురం బస్టాండ్ ప్రధాన కూడలిలో కమ్యూనిస్టు పార్టీ శ్రేణులు ఆందోళన చేపట్టారు. వారంతా అరుణ పతాకాలు చేతపట్టి, కేంద్రప్రభుత్వ విధానాలను విమర్శిస్తూ నినాదాలు చేశారు. అనంతరం రాష్ట్రపతి పేరిట రూపొందించిన వినతిపత్రాన్ని సబ్ కలెక్టర్ దేవధర ప్రధాన్‌కు అందించారు. ఆందోళనలో ప్రమోద్‌కుమార్ మహంతి, రామకృష్ణ దాస్, సత్యవ్రత నందో, కార్యకర్తలు పాల్గొన్నారు.



జయపురం: ఆందోళన చేపడుతున్న సీపీఐ నాయకులు

63కిలోల గంజాయి స్వాధీనం



సారాతో పట్టుబడిన నిందితుడు కుమార్ బిశాయి




స్వాధీనం చేసుకున్న గంజాయి బస్తాలు

కొరాపుట్: జిల్లాలోని లమతాపుట్ సమితి మాచ్‌ఖండ్ పోలీసు స్టేషన్ పరిధిలో గంజాయి అక్రమ రవాణాను పోలీసులు అడ్డుకున్నారు. ముందుగా వచ్చిన మాచారం మేరకు సోమవారం వాహన తనిఖీలు చేపట్టారు. అటుగా వస్తున్న కారులో ఉన్న వ్యక్తులు పోలీసులను చూసి పరారయ్యారు. దీంతో వాహనానని తనిఖీ చేయగా, 63కిలోల గంజాయి పట్టుబడింది. దీనికి మల్కన్‌గిరి జిల్లాలోని ఒనకడిల్లీ నుంచి మాచ్‌ఖండ్ వైపు తరలిస్తున్నట్లు భావిస్తున్నారు. పోలీసులు కేసు నమెదు చేసి, గంజాయిని స్వాధీనం చేసుకున్నారు.

సారా తరలిస్తూ వ్యక్తి అరెస్ట్

జయపురం: బైక్‌పై సారా తరలిస్తున్న యువకుడిని జయపురం ఎక్సైజ్ సిబ్బంది అరెస్ట్ చేశారు. నిందితుడు కుంద్రా సమితి లిమా గ్రామానికి చెందిన కుమార బిశాయి(25)గా ఆశాఖ అధికారి సంజయ కుమార్ కండి వెల్లడించారు. నిందితుడి నుంచి సారాతో పాటు బైక్‌ను స్వాధీనం చేసుకున్నామన్నారు. ఏఎస్ఐ ఎం.లక్ష్మణరావు, సిబ్బందితో కలిసి పంపుణీ ప్రాంతంలో పెట్రోలింగ్ నిర్వహిస్తున్న సమయంలో సారా పట్టుబడినట్లు పేర్కొన్నారు.

ఇటుక బట్టీలపై ఆకస్మిక దాడులు



ఇటుక బట్టీలపై దాడులు నిర్వహిస్తున్న అధికారులు

రాయగడ: జిల్లాలోని కాసీపూర్ సమితి టికిరి ప్రాంతంలో ఎటువంటి అనుమతులు లేకుండా నిర్వహిస్తున్న ఇటుక బట్టీలపై అధికారులు కొరడా ఝులిపించారు. తహసీల్దార్ శరత్ సాబోరో నేతృత్వంలో సిబ్బంది ఆరు ఇటుక తయారీ కేంద్రాలపై సోమవారం దాడులు నిర్వహించారు. అనుమతులు లేకుండా నిర్వహిస్తున్న యజమానులకు రూ.లక్ష 4 వేలను జరిమానాగా విధించారు.

ఇటువంటి వాటిపై మరిన్ని దాడులు నిర్వహించి, బాధ్యులపై కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. పర్యావరణానికి తీవ్ర హాని కలిగించే విధంగా వ్యవహరించే వారికి అనుమతులు సైతం రద్దు చేస్తామని స్పష్టంచేశారు.

గుడారిలో వినతుల స్వీకరణ



వినతులు స్వీకరిస్తున్న కలెక్టర్ స్వాధాదేవ్ సింగ్

రాయగడ: జిల్లాలోని గుడారి సమితిలో ప్రజా వినతుల స్వీకరణ కార్యక్రమం సోమవారం నిర్వహించారు. కలెక్టర్ స్వాధాదేవ్ సింగ్, జిల్లా గ్రామీణాభివృద్ధి సంస్థ ప్రాజెక్టు డైరెక్టర్ రవినారాయణ త్రిపాఠి, గుణుపూర్ సబ్ కలెక్టర్ లలిత్‌కుమార్ కుహారో, సీడీఎంఓ లాల్‌మోహన్ రౌత్రాయ్ తదితర అధికారులు హాజరయ్యారు. ఈ సందర్భంగా 64 వినతులు కలెక్టర్ దృష్టికి రాగా, ఇందులో 19 గ్రామ సమస్యలుగా గుర్తించారు.

మరో ఇద్దరికి ముఖ్యమంత్రి సహాయనిధి నుంచి రూ.22 వేల ఆర్థిక సాయాన్ని అందించారు. నమోదైన ఫిర్యాదులను త్వరితగతిన పరిష్కరించాలని సంబంధిత శాఖ అధికారులకు కలెక్టర్ ఆదేశించారు.

గొట్లాం విద్యార్థుల ప్రతిభ

- రాష్ట్రస్థాయి షూటింగ్‌బాల్ పోటీల్లో జిల్లాకు 3వ స్థానం



విద్యార్థులను అభినందిస్తున్న ఉపాధ్యాయులు

బొండపల్లి: శాప్ ఆధ్వర్యంలో బాలుర విభాగంలో నిర్వహించిన రాష్ట్ర స్థాయి షూటింగ్ బాల్ పోటీల్లో జిల్లాకు 3వ స్థానం దక్కినట్లు గొట్లాం జిల్లా పరిషత్ హైస్కూల్ హెచ్ఎం శ్రీరామాచారి, పీడీ యు.సత్యానంద్‌లు తెలిపారు. కృష్ణా జిల్లాలోని హనుమాన్ జంక్షన్‌లో ఈనెల 11, 12 వతేదీల్లో రాష్ట్రస్థాయి షూటింగ్ బాల్ పోటీలు నిర్వహించారని తెలిపారు. ఈ పోటీల్లో విజయనగరం జిల్లా జట్టు తరపున గొట్లాంలోని జెడ్పీ హైస్కూల్ నుంచి కె.హరి, కె.సందీప్‌లు పాల్గొని ప్రతిభ కనబరిచి 3 స్థానంలో జట్టు నిలవడానికి కృషి చేసి మెడల్స్‌తో పాటు ప్రశంసా పత్రాలు అందుకున్నారని తెలిపారు. ప్రతిభ కనబరిచిన విద్యార్థులను పాఠశాల ఉపాధ్యాయ సిబ్బంది, విద్యార్థులు అభినందించారు.

స్కూల్ గేమ్స్ స్విమ్మింగ్ పోటీల్లో జిల్లాకు పతకాలు



స్కూల్ గేమ్స్ స్విమ్మింగ్ పోటీల్లో పతకాలు సాధించిన జిల్లా క్రీడాకారులు

విజయనగరం: రాష్ట్రస్థాయిలో జరిగిన స్కూల్ గేమ్స్ స్విమ్మింగ్ పోటీల్లో జిల్లా నుంచి ప్రాతినిధ్యం వహించిన క్రీడాకారులు సత్తా చాటారు. కృష్ణా జిల్లా ఈడ్పుగల్లులో జరిగిన పోటీల్లో 10 పతకాలు సాధించగా..వాటిలో 3 బంగారు, ఒక సిల్వర్, 6 కాంస్య ఉన్నాయి. రాష్ట్రస్థాయి పోటీల్లో ఉత్తమ ప్రతిభ కనబరిచి పతకాలు సాధించిన జిల్లా క్రీడాకారులు, జట్టు కోచ్ అండ్ మేనేజర్‌లు పీవీఎస్ఎస్‌రాజు, సూర్యనారాయణలను జిల్లా స్కూల్ గేమ్స్ కార్యదర్శి ఎల్‌వీ రమణ అభినందించారు.

సీనియర్స్ తైక్వాండో పోటీల్లో జిల్లాకు పతకాలు



రాష్ట్రస్థాయి తైక్వాండో పోటీల్లో పతకాలు సాధించిన జిల్లా క్రీడాకారులు

విజయనగరం: రాష్ట్రస్థాయిలో జరిగిన సీనియర్స్ తైక్వాండో పోటీల్లో జిల్లా క్రీడాకారులు రాణించారు. ఈనెల 12న తూర్పుగోదావరి జిల్లా కాకినాడలో జరిగిన 38వ సీనియర్స్ అంతర్ జిల్లాల పోటీల్లో జిల్లా నుంచి ప్రాతినిధ్యం వహించిన క్రీడాకారులు మొత్తం 11 పతకాలు చేజిక్కించుకున్నారు. వారు సాధించిన పతకాల్లో ఒక బంగారు, నాలుగు వెండి, ఆరు కాంస్యం ఉన్నాయి. అంతేకాకుండా ఓవరాల్ చాంపియన్ షిప్‌లో తృతీయస్థానం దక్కించుకున్నారు. రాష్ట్రస్థాయి తైక్వాండో పోటీల్లో పాల్గొని పతకాలు సాధించిన జిల్లా క్రీడాకారులను జిల్లా తైక్వాండో అసోసియేషన్ అధ్యక్ష, కార్యదర్శులు గురానఅయ్యలు, సీహెచ్ వేణుగోపాలరావులు అభినందించారు.

కరాటే విజేతలకు కలెక్టర్ అభినందనలు



కరాటే విజేతలతో కలెక్టర్ నిషాంత్ కుమార్

పార్వతీపురం: కరాటే విజేతలను పార్వతీపురం మన్యం జిల్లా కలెక్టర్ నిషాంత్ కుమార్ సోమవారం తన కార్యాలయంలో సోమవారం అభినందించారు. విశాఖపట్నంలో జరిగిన 6వ అంతర్జాతీయ కరాటే చాంపియన్ షిప్‌లో విజేతలుగా నిలిచిన ఆరేళ్ల లోపు విభాగంలో బి.తమన్‌రాజ్(రజతం), తొమ్మిదేళ్ల లోపు విభాగంలో ఎం.కార్తికేయ (రజతం), ఏడేళ్లలోపు విభాగంలో కె.ఆకాష్ (కాంస్యం), ఎనిమిదేళ్లలోపు విభాగంలో ఎం.యువజాజ్ (కాంస్యం)పతకాలను పొందారు. ఈ మేరకు కలెక్టర్ ప్రత్యేకంగా ఆ విద్యార్థులను అభినందించి కోచ్‌లను ప్రత్యేకంగా ప్రశంసించారు.

రెండు బైక్‌లు ఢీ: ఒకరికి గాయాలు



చికిత్స పొందుతున్న కార్తికేయ

పార్వతీపురం: సీతానగరం మండలం పాపమ్మవలస గ్రామానికి చెందిన వంగపండు కార్తీక్, స్నేహితుడు పవన్‌లు ఎస్‌వీడీ కళాశాల నుంచి పాపమ్మవలస బైక్‌పై వస్తుండగా కొత్తవలస దుర్గమ్మ గుడి వద్ద ఎదురుగా వస్తున్న మోటార్ సైకిల్ ఢీకొంది. ఈ ఘటనలో కార్తీక్‌కు పలుచోట్ల గాయాలయ్యాయి. ఈ మేరకు స్థానికులు 108 వాహనం ద్వారా జిల్లా ఆస్పత్రికి చికిత్సకోసం తరలించారు.

బస్సు ఢీకొని మరొకరికి..

గరుగుబిల్లి మండలం నాగూరు గ్రామానికి చెందిన ఎస్. అప్పారావు రైస్‌మిల్లులో పనిచేసి విధులను ముగించుకుని ఇంటికి వెళ్తున్న తరుణంలో పార్వతీపురం నుంచి వీరఘట్టం వైపు వెళ్తున్న ఆర్టీసీ బస్సు వెనుకనుంచి ఢీకొంది. ఈ ప్రమాదంలో తల, కన్ను, నడుముకు గాయాలయ్యాయి. గాయపడిన అప్పారావును 108 వాహనం ద్వారా జిల్లా ఆస్పత్రికి తరలించగా చికిత్స పొందుతున్నాడు.



చికిత్స పొందుతున్న అప్పారావు

క్లుప్తంగా

మద్యం మత్తులో వ్యక్తి ఆత్మహత్య

సారవకోట: మండలంలోని గొర్రిబంద పంచాయతీ రైవాడ గ్రామానికి చెందిన చింతపల్లి జగదీష్ (42) మద్యం మత్తులో పురుగు మందు తాగి మృతి చెందినట్లు భార్య రాములమ్మ సోమవారం పోలీస్‌స్టేషన్‌లో తెలిపారు. పోలీసులు తెలిపిన వివరాల మేరకు.. ఈ నెల 6న భార్యతో తగదాపడిన జగదీష్ ఆమెను రాయితో కొట్టారు. దీంతో ఆమె గాయపడి పాతపట్నం సీహెచ్‌సీలో చికిత్స పొందుతున్నారు. దీనిపై మనస్తాపం చెందిన జగదీష్ 7వ తేదీ రాత్రి మద్యం మత్తులో పురుగు మందు కలిసి తాగేశాడు. ఆ తర్వాతి రోజు విరేచనాలు కావడంతో తన సోదరుడికి విషయం చెప్పాడు. దీంతో 108 వాహనంలో అతడిని నరసన్నపేట ప్రభుత్వాస్పత్రికి, అనంతరం శ్రీకాకుళం రిమ్స్‌కు తరలించారు. అక్కడ చికిత్స పొందుతూ ఆదివారం రాత్రి మృతి చెందాడు. భార్య ఇచ్చిన ఫిర్యాదు మేరకు హెచ్‌సీ రమణమూర్తి కేసు నమోదు చేశారు. మృతుడికి ఇద్దరు పిల్లలు ఉన్నారు.

అంతుచిక్కని వ్యాధితో రెండు ఆవులు మృతి



మృతి చెందిన ఆవులు

పొందూరు: మండలంలోని రెడ్డిపేట గ్రామంలో ఆదివారం సాయంత్రం అంతుచిక్కని వ్యాధితో రెండు ఆవులు ఆదివారం మృతి చెందాయి. గ్రామానికి చెందిన కొంచాడ మహేష్ అనే రైతుకు చెందిన ఆవులు ఆదివారం సాయంత్రం వరకు ఎంతో ఆరోగ్యంగా ఉన్నాయి. ఒక్కసారిగా ఒకదాని తర్వాత ఒకటిగా నడుము విరుస్తూ కింద పడి కొట్టుకుంటూ ప్రాణాలు విడిచాయని రైతులు చెప్పారు. వీటి ధర సుమారు రూ.80 వేలు వరకు ఉంటాయని తెలిపారు. హఠాత్పరిణామంతో గ్రామంలోని పశువుల యజమానులు ఆందోళన చెందుతున్నారు. గ్రామంలో పశువైద్య శిబిరాన్ని ఏర్పాటు చేయాలని వైఎస్సార్‌సీపీ నాయకులు కంబావు సూర్యారావు కోరారు.

20 ఎకరాల తోటల్లో అగ్ని ప్రమాదం



మంటలను అదుపు చేస్తున్న అగ్నిమాపక సిబ్బంది

మెళియాపుట్టి: మండలంలోని మర్రిపాడు-సి పంచాయతీ పరిధిలోని సవర మర్రిపాడు, మర్రిపాడు గ్రామాలకు చెందిన 30 మంది గిరిజన, హరిజన, ఇతరులకు చెందిన సుమారు 20 ఎకరాల తోటల్లో సోమవారం అగ్ని ప్రమాదం సంభవించింది. జీడి, మామిడి, టేకు, అకేశ, నీలగిరి, వెదురు, పనస తదితర చెట్లు కాలిపోయాయని రైతులు చెబుతున్నారు. ప్రమాదానికి గల కారణాలు తెలియరాలేదు. సోమవారం మిట్ట మధ్యాహ్నం మంటల వ్యాప్తిని చూసి సవర మర్రిపాడు గ్రామానికి చెందిన గిరిజనులు సవర జగ్గారావు, పెద్దింటి కృష్ణారావులు గ్రామస్తులకు తెలియజేశారు. వారు వెంటనే టెక్కలి అగ్నిమాపక సిబ్బందికి సమాచారం అందించారు. సిబ్బంది వచ్చేలోగానే మంటలు తీవ్రంగా వ్యాప్తి చెందాయి. పలువురు రైతులు బకెట్లతో మంటలను అదుపు చేయడానికి ప్రయత్నించినా మంటలు అదుపులోకి రాలేదు. జీడి మామిడి పువ్వు,పిందె నిండుగా ఉన్న సమయంలో ఇలాంటి ప్రమాదం జరగడంతో రైతులు దారపు వీరన్న, వునుకూరు బాలయ్య, తలగాన పెద్ద తిప్పన్న, పవర అప్పలమ్మ లతోపాటుగా పలువురు రైతులు ఆందోళన చెందుతున్నారు. అధికారులు పరిశీలించి న్యాయం చేయాలని కోరుతున్నారు.

పార్ట్‌టైమ్ నర్సింగ్ ఉద్యోగానికి వాక్ ఇన్ ఇంటర్వ్యూ

శ్రీకాకుళం పాతబస్టాండ్: ఆంధ్రప్రదేశ్ సాంఘిక సంక్షేమ గురుకుల విద్యాలయ సంస్థ ఆధ్వర్యంలో నడుస్తున్న డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ గురుకుల పాఠశాలలో ఖాళీగా ఉన్న స్టాఫ్ నర్స్ పోస్టు పార్ట్ టైమ్ పద్ధతిలో భర్తీ చేయనున్నట్లు ఆ సంస్థ కో ఆర్డినేటర్ మేరీ గ్రేసీ ఓ ప్రకటనలో తెలిపారు. ఆసక్తి గల అభ్యర్థులు వారి బయోడేటాతో పాటు సర్టిఫికెట్స్‌తో నేరుగా 16వ తేదీ సాయంత్రం 5 గంటల్లోపు దరఖాస్తు చేయాలని తెలిపారు. కంచిలిలో ఒక పురుష స్టాఫ్ నర్సు ఉద్యోగం భర్తీకి ఇంటర్వ్యూ నిర్వహిస్తామన్నారు. వివరాలకు 08942-279926, 9701736862, 9000314209 నంబర్లను సంప్రదించాలని సూచించారు.

30 బస్తాల ధాన్యం దగ్ధం

సోంపేట: అగ్ని ప్రమాదంలో 30 బస్తాల ధాన్యం కాలిపోయాయి. ఈ సంఘటన పలాస పురం గ్రామంలో ఆదివారం అర్ధరాత్రి చోటుచేసుకోగా.. రైతు దున్న బైరికి చెందిన ధాన్యం దగ్ధమయ్యాయి. రైతు బైరి తన ఐదెకరాల పొలంలో సాగు చేసిన వరిని నూర్పు చేయగా వచ్చిన 30 బస్తాల ధాన్యాన్ని పొలంలోనే గడ్డికుప్పలో నిల్వ చేసి ఉంచారు. అర్ధరాత్రి వేళ సంభవించిన ప్రమాదంలో కాలిపోవడంతో రైతు కన్నీరుమున్నీరుగా రోదించారు.

స్వచ్ఛమైన ప్రేమ.. అచ్చమైన చిరునామా



- కులాంతర వివాహం చేసుకున్న గురువులు
- సమాజానికి ఆదర్శంగా నిలుస్తున్న ఉపాధ్యాయ దంపతులు
- నేడు ప్రేమికుల దినోత్సవం

మీది ఏ కులమని ప్రశ్నిస్తే.. ప్రేమికులమని సమాధానమిచ్చారు ఆ గురువులు. కులాంతర వివాహాలు చేసుకుని స్వచ్ఛమైన ప్రేమకు అచ్చమైన చిరునామాగా నిలిచారు. పెద్దలను ఒప్పించి కొందరు, స్నేహితుల సాయంతో ఇంకొందరు, జీవితంలో స్థిరపడ్డాక మరికొందరు ప్రేమించిన వారిని పెళ్లి చేసుకుని ప్రేమకు సార్థకత చేకూర్చారు. అదే ప్రేమను పునాదిగా చేసుకుని అందమైన జీవితాన్ని నిర్మించుకున్నారు. నేడు ప్రేమికుల దినోత్సవం. ఈ సందర్భంగా కొన్ని ప్రేమ కథలు..

– ఇచ్ఛాపురం రూరల్



ప్రేమకు ప్రతి'రూపం'

ప్రేమికుల దినోత్సవం సందర్భంగా లక్ష్మీనర్సుపేట గ్రామానికి చెందిన తరణి ప్రసాద్ మిశ్రా వంశధార నదీ తీరంలో సైకత శిల్పం రూపొందించారు. ఈ శిల్పం చూపరులను ఆకట్టుకుంటోంది. –ఎల్‌ఎన్ పేట

తొలి చూపులోనే..



ఉపాధ్యాయులు శ్రీనివాస రావు, ప్రత్యూష దంపతులు

నరసన్నపేట మండలానికి చెందిన అక్కివలస శ్రీనివాస రావు 2010లో ఉపాధ్యాయ శిక్షణ పొంది ఇచ్ఛాపురం మండలం బాలకృష్ణాపురం ప్రాథమికోన్నత పాఠశాలలో ప్రధానోపాధ్యాయునిగా చేరారు. స్థానిక మండల విద్యావనరుల కేంద్రంలో బోధనలో శిక్షణ పొందుతున్నప్పుడు సోంపేట మండలంకు చెందిన పి.ప్రత్యూష అనే ఉపాధ్యాయురాలితో స్నేహం ఏర్పడింది. మూడేళ్ల పాటు కొనసాగిన వీరి స్నేహం ప్రేమగా మారింది. వీరి వివాహానికి కులాలు అడ్డు గోడలుగా నిలిచాయి. వీరికి బాసటగా స్నేహితుడు సాధు శివి చక్రవర్తి (మేఘాలయ రాష్ట్రం నార్త్ గోరోహిల్స్ జిల్లా కలెక్టర్) అండగా నిలిచాడు. ఇద్దరు భావాలు ఒకటే కావడంతో 2013లో అన్నవరంలో అదే స్నేహితుల సమక్షంలో వివాహం జరిగింది.

ఎంతో అన్యోన్యంగా సాగుతున్న వీరి దాంపత్యం మూడు పువ్వులు, ఆరు కాయలుగా కాపురం సాగుతోంది. వీరికి అభినందన్, ఆరాధ్య అనే కుమారుడు, కుమార్తె ఉన్నారు. ప్రస్తుతం శ్రీనివాస రావు బుడ్డేపుపేట ప్రాథమిక పాఠశాలలో, ప్రత్యూష ఇచ్ఛాపురం పట్టణం బెల్లుపడ ప్రాథమిక పాఠశాలలో ప్రధానోపాధ్యాయురాలిగా పనిచేస్తున్నారు. ప్రేమించడం తప్పులేదు గానీ, ఆ ప్రేమ పేరుతో మోసం, దగా చేయకుండా ప్రేమ పవిత్రతను చివరి వరకూ కాపాడుకుంటూ వెళ్లాలంటూ నేటి ప్రేమికులకు ఈ దంపతులు సూచిస్తున్నారు.

తరగతి గది నుంచి..



గిరిబాబు, ఉమాకుమారి దంపతులు

ఇద్దరూ క్లాస్‌మేట్స్. ఒకే దగ్గర ఉపాధ్యాయ శిక్షణ పొందిన వీరు ప్రేమికులుగా మారి ఇప్పుడు ఒకే దగ్గర పనిచేస్తున్నారు. తొగరాంకు చెందిన ఉప్పు గిరిబాబు శ్రీకాకుళం గురజాడ బీఈడీ కళాశాలలో బయాలజీ ఉపాధ్యాయ శిక్షణ తీసుకుంటున్న సమయంలో శ్రీకాకుళానికి చెందిన ఉమాకుమారి అదే కళాశాలలో అదే కోర్సులో ఉపాధ్యాయ శిక్షణ పొందారు. ఇద్దరి మధ్య ఏర్పడిన ప్రేమ సుమారు ఏడేళ్ల పాటు సాగింది. ఇద్దరూ నిరుద్యోగులే కావడంతో పెద్దలు వీరి ప్రేమకు అంతరాయం కలిగించారు. ఉద్యోగం వచ్చినప్పుడే మీ పెళ్లి అంటూ పెద్దలు హుకుం జారీ చేయడంతో ప్రేమను గెలిపించేందుకు కొంత కాలం ప్రేమకు స్వస్తి పలికారు. 2012 డీఎస్సీలో శ్రమించి ఒకేసారి బయాలజీ ఉపాధ్యాయులుగా ఉద్యోగం సంపాదించారు. నేరుగా ఇద్దరూ ఇచ్ఛాపురం మున్సిపాలిటీ గవర్నమెంట్ హైస్కూల్లో బయాలజీ ఉపాధ్యాయులుగా చేరారు. వీరి కృషికి ఫిదా అయిన పెద్దలు ప్రేమ వివాహానికి పచ్చజెండా ఊపడంతో 2013లో పెళ్లి చేసుకున్నారు. ఈ దంపతులకు కుమారులు భార్గవ్, ప్రణవ్ ఉన్నారు.

స్థిరపడ్డాకే..



సంతోష్‌కుమార్, రాణీగొడ దంపతులు

ఇద్దరు నిరుద్యోగుల మధ్య ఏర్పడిన స్నేహం.. ప్రేమగా మారింది. ఆపై పెద్దలను ఒప్పించి పెళ్లి కూడా చేసుకున్నారు. పాలకొండ బొంగు సంతోష్‌కుమార్ బీఈడీ చేసి డీఎస్సీ సాధన సమితి జిల్లా అధ్యక్షుడిగా పనిచేసేవారు. ఉపాధ్యాయ శిక్షణ పొందిన ఇచ్ఛాపురానికి చెందిన రాణిగొడ ఒకసారి జిల్లాలో జరిగిన డీఎస్సీ సాధన సమితి సమావేశంలో సంతోష్‌ను కలవడంతో వీరి మధ్య స్నేహం చిగురించింది. అప్పటి నుంచి స్నేహితులుగా మారారు. ఈ నేపథ్యంలో 2014 డీఎస్సీలో ఇద్దరికీ ఉద్యోగాలు రావడం, యాదృచ్ఛికంగా సంతోష్‌కుమార్ సైతం ఇచ్ఛాపురం మండలానికే రావడంతో వారి స్నేహం కాస్తా ప్రేమగా మారింది. సంతోష్‌కుమార్ హరిపురం ప్రాథమికోన్నత పాఠశాలలో ఉపాధ్యాయుడిగా చేరగా, రాణిగొడ అదే రహదారిలో ఉన్న బొడ్డబడ ఒడియా ప్రాథమికోన్నత పాఠశాలలో ప్రధానోపాధ్యాయురాలిగా విధుల్లో చేరారు. కాలం కలిసి రావడంతో ఇద్దరి స్నేహం ప్రేమ వరకు వెళ్లి పెళ్లికి దారి తీసింది. ఇద్దరు కులాలు వేర్వేరు కావడంతో పెద్దలు పెళ్లికి ససేమిరా అన్నారు. సంతోష్ చెల్లికి పెళ్లి అయిన తరువాత పెద్దల్ని మరోమారు ఒప్పించి 2018 మార్చి 8న మహిళా దినోత్సవం నాడు పాలకొండలో ఇరు కుటుంబ సభ్యుల సమక్షంలో ఘనంగా పెళ్లి చేసుకున్నారు. వీరికి యశ్వంత్‌కుమార్ అనే కుమారుడు ఉన్నాడు.

మాస్టారు ప్రేమకథ..



సోమేష్ దంపతులు

కంచిలి మండలం బూరగాం గ్రామానికి చెందిన కీలు సోమేశ్వరరావు సోంపేట మండలం రుషికుద్ద ప్రాథమిక పాఠశాలలో పనిచేస్తూ మండల డీఆర్పీగా వ్యవహరించేవారు. బారువ గ్రామానికి చెందిన ప్రమోదిని కుమారీ దాస్ 2009లో విద్యా వలంటీర్‌గా పనిచేసేవారు. మండల విద్యావనరుల కేంద్రంలో శిక్షణ సమయంలో వారి మధ్య ఏర్పడిన పరిచయం ప్రేమకు దారితీసింది. కులం అడ్డు వచ్చినా ఏడాది పాటు ఇరు కుటుంబ పెద్దల్ని ఒప్పించి ఎట్టకేలకు 2010లో పెళ్లి చేసుకున్నారు. ప్రస్తుతం సోమేష్ ఇచ్ఛాపురం మండలం ధర్మపురం ఉన్నత పాఠశాలలో, ప్రమోదినీ కుమారీ దాస్ ఒడిశా బలియాగడ ఒడియా పాఠశాలలో పనిచేస్తున్నారు.

'గర్భగుడిలోకి ప్రవేశం వద్దు'



క్యూలు పరిశీలిస్తున్న ఏసీ సూర్యప్రకాశరావు

జలుమూరు: శ్రీముఖలింగంలో ఈ నెల 18 నుంచి 20 వరకు జరగనున్న శివరాత్రి ఉత్సవాలు సజావుగా నిర్వహించాలని దేవదాయ శాఖ ఏసీ సూర్యప్రకాశరావు అన్నారు. సోమవారం శ్రీముఖలింగంలో శివరాత్రి ఉత్సవ ఏర్పాట్లు పరిశీలించి అధికారులతో మాట్లాడారు. గర్భగుడిలోకి కలెక్టర్, మంత్రి, శాశ్వత ధర్మకర్త మినహా ఎవరినీ గర్భగుడిలో అనుమతించవద్దని సూచించారు. వీఐపీల పేరిట భక్తులను ఇబ్బందులు పెట్టకుండా సామాన్య భక్తులకు సైతం స్వామి దర్శనం చేయించాలన్నారు. క్యూలైన్‌ల ఏర్పాట్లు పరిశీలించి తాగునీరు, ఎండ తగలకుండా భక్తులకు తగిన సదుపాయాలు కల్పించాలన్నారు. అలాగే భక్తులకు మజ్జిగ, అన్నదానం తదితరవి ఏర్పాటుకు దాతలను చూడాలని ఈఓను ఆదేశించారు. ఉత్సవాల చివరి రోజు స్వామి త్రిశూల స్నానాలకు వంశధార నదిలో నిర్వహించే పుణ్యక్రతువుకు రహదారిని శుభ్రం చేయించాలని తెలిపారు. గర్భగుడిలో స్వామి భక్తులకు బాగా కనిపించేందుకు విద్యుత్ సౌకర్యం బాగా చేయాలన్నారు. ఆయనతోపాటు పరిశీలకులు ప్రసాద్‌బాబు, వెంకటరమణ,ఈఓ ప్రభాకరరావు, అర్చకులు పాల్గొన్నారు.

జాతీయ స్థాయికి మురపాక విద్యార్థుల ప్రాజెక్టు



మురపాక హైస్కూల్‌లో విద్యార్థులను అభినందిస్తున్న హెచ్‌ఎం అరుణ, ఉపాధ్యాయులు

లావేరు: మండలంలోని మురపాక హైస్కూల్‌లో చదువుతున్న 9వ తరగతి ఇంగ్లిష్ మీడియం విద్యార్థుల ప్రదర్శన జాతీయ స్థాయికి ఎంపికైందని హైస్కూల్ హెచ్‌ఎం ఎం.అరుణ తెలిపారు. విద్యార్థులను సోమవారం హైస్కూల్‌లో హెచ్‌ఎం అరుణ, ఉపాధ్యాయులు అభినందించారు. జనవరిలో ఎస్‌సీఈఆర్‌టీ వారు ప్రభుత్వ పాఠశాలల్లో చదువుతున్న విద్యార్థులు వారికి నచ్చిన దానిపై వీడియాలు చేసి పంపించాలని రాష్ట్రవ్యాప్తంగా కోరారు. మురపాక హైస్కూల్‌లో 9వ తరగతి ఇంగ్లిష్ మీడియం విద్యార్థులు జి.గౌతమి, జె.యోచన, కె.యశస్విని, బి.యశ్వంత్, పి.హేమసుందర్‌లు ఫార్మర్ అలెర్టు అలారం ఫ్రమ్ ఎలక్ట్రిక్ షాక్ ఇన్ అగ్రికల్చర్ అనే దానిపై వీడియో ప్రదర్శన చేసి ఎస్‌సీఈఆర్‌టీకు పంపించగా అది జాతీయ స్థాయి ప్రదర్శనకు ఎంపికైంది. ఈ నెల 16వ తేదీన బెంగళూరులో జరగనున్న జాతీయ స్థాయి ప్రదర్శనలో మురపాక హైస్కూల్ విద్యార్థులు పాల్గొంటారని హెచ్‌ఎం తెలిపారు. విద్యార్థులకు గైడ్‌గా ఉపాధ్యాయురాలు ఎస్‌వీఎస్ పూర్ణిమ, ఇన్‌స్ట్రక్టర్ శ్రావ్యలు వ్యవహరించారు. కార్యక్రమంలో సీఆర్‌పీ వి.గోవిందరావు, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

రట్టిలో విద్యుత్ షార్ట్ సర్క్యూట్

- ఇల్లు, రూ. 1.50 లక్షల నగదు దగ్ధం



కాలిపోయిన వస్తువులు

మందస: భేతాళపురం పంచాయతీ రట్టి గ్రా మంలో సోమవారం విద్యుత్ షార్ట్ సర్క్యూట్ తో ఇల్లు, విలువైన సామాన్లు, నగదు దగ్ధమయ్యాయి. తాపీమేస్త్రీ మామిడి ఈశ్వరరావు ఇంటిలో విద్యుత్ షార్ట్ సర్క్యూట్ జరగడంతో ఒక్కసారిగా మంటలు చెలరేగాయి. దట్టమైన పొగ వ్యాపించడంతో ఈశ్వరరావు భార్య జ్యోతి ఇద్దరు పిల్లలను తీసుకొని బయటకు పరుగు తీయడంతో ప్రాణాపాయం తప్పింది. ఈ ఘటనలో రూ.1.50లక్షల నగదు, విలువైన డాక్యుమెంట్లు, సామానులు దగ్ధమయ్యాయి. స్థానికులు చేరుకొని మంటలను అదుపు చేశారు. బాధిత కుటుంబాన్ని సర్పంచ్ మామిడి సింహాద్రి, వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ నాయకులు పులారి కూర్మారావు, పితాంబరం పరామర్శించారు.

శ్రీశైలం మల్లన్నకు పొందూరు తలపాగా

- ఏటా ఆనవాయితీగా శ్రీశైలంకు వస్త్రాలు తీసుకెళ్తున్న పొందూరు చేనేత కార్మికులు
- పొందూరుతో పాటు పలు చోట్ల నుంచి వస్త్రాల సమర్పణ
- శివరాత్రికి మల్లన్నకు నివేదన



తలపాగా, వస్త్రాలను ఊరేగిస్తున్న భక్తులు

పొందూరు: కర్నూలు జిల్లా శ్రీశైలంలో కొలువైన భ్రమరాంబ, మల్లికార్జున స్వామికి శ్రీకాకుళం జిల్లా పొందూరు నుంచి ఏటా శివరాత్రి కానుక అందుతుంది. మహాశివరాత్రి పర్వదినం సందర్భంగా పొందూరులో తయారుచేసిన తలపాగా వస్త్రాలు శ్రీశైలం తీసుకెళ్తారు. పొందూరుతో పాటు ఈ జిల్లాలోని పలు గ్రామాల వారు తలపాగా, వస్త్రాలు తయారు చేసి శ్రీశైల మల్లన్నకు సమర్పిస్తారు. నాలుగు దశాబ్దాలుగా ఈ ఆనవాయితీ కొనసాగుతోంది. ఈ ఏడాది ఆ అదృష్టం స్థానిక చేనేతవాడకు చెందిన బనిశెట్టి వీరాంజనేయులు, కందాన శంకర రావు, అంకం ప్రసాద్, బనిశెట్టి శ్రీనులకు దక్కింది. శివయ్యకు తలపాగా, అమ్మవారికి చీర, శనగల బసవన్న, వినాయకుడికి పంచెను నేశారు.

హైదరాబాద్, ఒంగోలుకు కూడా..

పొందూరుకు చెందిన భక్తులు శ్రీశైలంకు తలపాగా వస్త్రాలను తీసుకెళ్లి సమర్పించడం పరిపాటి. శ్రీశైలంకు ఏపీతో పాటు ఇతర రాష్ట్రాల నుంచి భక్తులు శివరాత్రికి వస్తుంటారు. ఈ నేపథ్యంలో హైదరాబాద్, ఒంగోలుకు చెందిన వారు పొందూరు భక్తులకు పరిచయమయ్యారు. దీంతో హైదరాబాద్, ఒంగోలుకు చెందిన భక్తులు తలపాగా వస్త్రాలను పొందూరులోనే నేయించి వారి స్వగ్రామాలకు తీసుకెళ్లనున్నారు. నేరుగా అక్కడ నుంచి శివరాత్రికి శ్రీశైలంలో మల్లికార్జునస్వామికి సమర్పిస్తారు.

సమర్పించే వస్త్రాలు ఇవే..

మల్లికార్జున స్వామికి 366 మూరల(160 మీటర్లు) పొడవు 48 సెంటీమీటర్లు వెడల్పు ఉన్న తలపాగా, భ్రమరాంబకు 6 మీటర్లు పసుపు అంచు చీర, శనగల బసవన్న(నందీశ్వరుడు)కు 6 మీటర్లు అరుణ వర్ణ అంచు పంచె, వినాయకునికి 6 మీటర్లు ఎరుపు అంచు పంచెలను నేశారు. ఈ వస్త్రాలను శివలింగాకారంలో మలిచారు. ప్రతి రోజూ తలపగా, వస్త్రాల వద్ద భజనలు చేస్తున్నారు. చేనేత వాడలోని ప్రజలంతా పూజలు నిర్వహిస్తున్నారు. మహాశివరాత్రికి ముందు రోజు ఈ వస్త్రాలను శ్రీశైలం తీసుకువెళ్లి స్వామికి సమర్పిస్తారు.

చరిత్ర సృష్టించిన ముఖలింగం

పొందూరులోని వాండ్రంగి వీధికి చెందిన ఆకాశం ముఖలింగం 33 సార్లు శ్రీశైలం వెళ్లి మల్లన్నకు వస్త్రాలను సమర్పించి చరిత్ర సృష్టించారు. అలాగే లావేటి వీధికి చెందిన బూడిద చిన్నారావు 21 సార్లు స్వామికి వస్త్రాలను సమర్పించారు. వస్త్రాలను తీసుకొచ్చే పొందూరు కార్మికులకు వసతి, భోజన సదుపాయాలను, ఇతర సౌకర్యాలను కల్పిస్తామని శ్రీశైలం దేవస్థానం దేవాంగసత్రం డైరెక్టర్ కాకర్ల రాజారావు తెలిపారు. ఇప్పటికే సంబంధిత కార్మికులు వసతులు కల్పించాలని తమను కోరినట్లు వివరించారు. వారందరికీ అన్ని సదుపాయాలు కల్పిస్తున్నట్లు చెప్పారు.



తలపాగాను ఆలయ శిఖరంపైకి తీసుకెళ్తున్న దృశ్యం (ఫైల్)

నిష్ఠతో నేస్తున్నాం



ఎంతో నియమ, నిష్ఠలతో శ్రీశైలం మల్లన్నకు తలపాగా వస్త్రాలను నేశాం. ఈ వస్త్రాలను నేస్తున్నంత సేపు శివ నామస్మరణలోనే ఉన్నాం. ఉపవాస దీక్షలోనే వస్త్రాలను పూర్తిచేశాం. ఏటా వస్త్రాలను నేసే మహాభాగ్యం మాకు దక్కుతుండటం ఎంతో సంతోషంగా ఉంటుంది.

– అంకం ప్రసాద్, చేనేత కార్మికుడు, పొందూరు

తలపాగా వస్త్రాలను నేయించాను

పొందూరుకు చెందిన భక్తులు శ్రీశైలంలో పరిచయమయ్యారు. తలపాగా వస్త్రాలను తీసుకువచ్చి మల్లికార్జున స్వామికి సమర్పించడం కనుల విందుగా ఉంటుంది. ఈ ఏడాది వస్త్రాలను పొందూరులో నేయించాను. వస్త్రాలను హైదరాబాద్ తీసుకువెళ్తున్నాను. అక్కడ నుంచి శ్రీశైలంకు శివరాత్రికి వెళ్లి వస్త్రాలను సమర్పిస్తాను.

– ఉప్పు బీమసుందరరావు, హైదరాబాద్

లావేరులో శ్రీశైలం మల్లన్న తలపాగా ఊరేగింపు

లావేరు: మండలంలోని లావేరు గ్రామంలో సోమవారం శ్రీశైలం మల్లికార్జున స్వామి కోసం చేనేత మగ్గంపై నేసిన తలపాగాను ఊరేగించారు. లావేరు గ్రామంలోని పెద్దవీధికి చెందిన చేనేత కార్మికులు కాశిన వెంకటరమణ, కాశిన సవర్రాజు కుటుంబ సభ్యులు శివరాత్రి రోజున శ్రీశైలం మల్లన్నకు సమర్పించడం కోసం తలపాగాను చేనేత మగ్గంపై నేశారు. సోమవారం గ్రామంలోని ఆలయాల్లో తలపాగాకు పూజలు నిర్వహించి అనంతరం ఊరిలో మేళతాళాలతో ఊరేగించారు.



లావేరులో మల్లన్న తలపాగాను ఊరేగిస్తున్న చేనేత కార్మికులు